ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024

వసతి గృహాల్లో సమస్యలు వాస్తవమే

- పరిష్కరించాలని ప్రభుత్వానికి నివేదిస్తా
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు
- జోగంపేట హాస్టల్‌లో కరెంట్ షాక్‌తో మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి పరామర్శ

- 7లో



చైర్మన్ శంకరరావు

సీనియర్స్ కమ్ బ్యాక్!

క్రియాశీల రాజకీయాల్లో మళ్లీ దాడి, కొణతాల



దాడి వీరభద్రరావు



కొణతాల రామకృష్ణ

- ఒకరు టీడీపీలోకి, మరొకరు జనసేనలోకి..
- వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించడమే లక్ష్యం
- ద్వితీయ శ్రేణి నేతలకు దిశానిర్దేశం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఆ ఇద్దరు నేతలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వేర్వేరు పార్టీల్లో వున్న వీరు సుమారు నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం గల ఉద్దండులు. ఒకప్పుడు అనకాపల్లి కేంద్రంగా రాజకీయాలను నడిపారు. కాలక్రమంలో జరిగిన పలు పరిణామాల కారణంగా కొంతకాలంపాటు క్రియాశీలక రాజకీయాలకు దూరంగా వున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ మళ్లీ యాక్టివ్ అయ్యారు. ఒకరు తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన టీడీపీలోకి తిరిగిరాగా, మరొకరు పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీలో చేరారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. రాజకీయాలను మరోసారి శాసించేందుకు దూకుడు పెంచుతున్నారు. దీంతో జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ... ఇద్దరూ గతంలో జిల్లా రాజకీయాలను శాసించారు. రాష్ట్ర రాజకీయాల్లో కూడా క్రియాశీలకంగా వ్యవహరించారు. ఇటీవల వరకు వైసీపీ వున్న దాడి వీరభద్రరావు ఆ పార్టీ అధినేత తీరుపై విసుగుచెంది ఇటీవల తిరిగి సొంతగూటికి (టీడీపీ)చేరారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సమక్షంలో తన ఇద్దరు కుమారులు రత్నాకర్, జయవీర్‌తో కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. సుదీర్ఘ కాలంపాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన అనుభవంతో ఆయన నియోజకవర్గంలో తనకున్న పరిచయాలతో టీడీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. రోజూ తన కార్యాలయంలో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు. ఇక మరో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా ... మిగతా 8వ పేజీలో

అమాత్యుని ఇష్టారాజ్యం!

ప్రభుత్వ స్థలాల్లో తండ్రి విగ్రహాలు ఏర్పాటు చేయిస్తున్న మంత్రి అమర్

- కశింకోటలో గురునాథరావు విగ్రహం కోసం 15 సెంట్లు దర్జాగా ఆక్రమణ
- మార్కెట్ ధర ప్రకారం రూ.3 కోట్ల విలువ
- రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అనుమతులు లేకుండానే పనులు
- కన్నూరుపాలెంలో సీఎస్ఆర్ నిధులతో పార్కు నిర్మాణం
- గురునాథరావు పేరుతోపాటు విగ్రహం ఏర్పాటు
- పరవాడపాలెంలో కల్యాణ మండపం, పైన రామాలయం నిర్మాణం
- రెండింటికీ కలిపి తన తండ్రి పేరు రాయించుకున్న మంత్రి



కశింకోటలో ప్రభుత్వ స్థలంలో గురునాథరావు విగ్రహం ఏర్పాటుకు పనులు జరుగుతున్న దృశ్యం

కశింకోట, ఫిబ్రవరి 8:

అనకాపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా తన తండ్రి గుడివాడ గురునాథరావు విగ్రహాలను ఏర్పాటు చేయిస్తున్నారు. సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసిన పార్కులకు, కల్యాణ మండపాలకు, చివరకు ఆలయానికి కూడా గురునాథరావు పేరు పెట్టిస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.



పరవాడపాలెంలో కల్యాణమండం, రామాలయానికి గురునాథరావు పేరు పెట్టిన దృశ్యం

కశింకోట ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న కోదండ సీతారామాలయానికి సంబంధించి 13.02 ఎకరాల భూమి ఉంది. ఇక్కడ వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు భవనాలు నిర్మించేందుకు గతంలో ఈ భూమిని ప్రభుత్వం తీసుకుంది. దీనికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి ఇస్తామని అప్పట్లో రెవెన్యూ అధికారులు, దేవదాయ శాఖ అధికారులకు చెప్పారు. అనంతరం కొంత స్థలంలో భవనాలు నిర్మించారు. మరికొంత స్థలం ఖాళీగా వుంది. అయితే రెవెన్యూ అధికారులు ప్రత్యామ్నాయ భూమి ఇవ్వకపోవడంతో దేవదాయ శాఖ అధికారులో కోర్టులో కేసు వేశారు. ఈ అంశం కోర్టు పరిధిలో వుంది. ఇదిలావుండగా ఖాళీగా వున్న స్థలంలో జాతీయ రహదారికి ఆనుకుని సుమారు 15 సెంట్లలో మంత్రి అమర్‌నాథ్ తండ్రి మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు విగ్రహం ఏర్పాటుకు పనులు మొదలుపెట్టారు. అమర్‌కు ముఖ్య అనుచరుడైన స్థానిక వైసీపీ నేత ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. కశింకోటలో హైవే పక్కన సెంటు స్థలం రూ.20 లక్షలు పలుకుతున్నది. గురునాథరావు విగ్రహం ఏర్పాటుకు 15 సెంట్ల స్థలాన్ని వినియోగిస్తున్నారు. మార్కెట్ రేటు ప్రకారం ఈ స్థలం విలువ రూ.3 కోట్లు వుంటుందని స్థానికులు చెబుతున్నారు. కాగా ప్రభుత్వ స్థలంలో గురునాథరావు విగ్రహం ఏర్పాటుపై పంచాయతీ ఈవో రమేశ్‌ను వివరణ కోరగా, విగ్రహం ఏర్పాటుకు పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసిందని చెప్పారు. పంచాయతీ రాజ్ శాఖ పరంగా అనుమతులు మంజూరు చేశారా? అని అడగ్గా.. సరైన సమాధానం చెప్పలేదు.

సీఎస్ఆర్ నిధులతో పార్కు... తన తండ్రి పేరు, విగ్రహం పెట్టుకున్న మంత్రి

ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు తమ లాభాల్లో కొంతమొత్తాన్ని సామాజిక బాధ్యత కింద చుట్టుపక్కల గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఇస్తుంటాయి. ఈ నిధులను ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలి. కానీ మండలంలోని కన్నూరుపాలెంలో చెరువు గట్టుపై సీఎస్ఆర్ నిధులతో పార్కును ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే వున్నప్పటికీ దీనికి 'గుడివాడ గురునాథరావు మెమోరియల్ పార్కు' అని పేరుపెట్టారు. పార్కు ప్రవేశ ద్వారం పక్కన గురునాథరావు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కన్నూరుపాలెంలో పార్కు అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు ఎన్ని వచ్చాయి? గురునాథరావు విగ్రహాన్ని ఏ నిధులతో ఏర్పాటు చేశారు? అని పంచాతీయ అధికారులను అడిగితే తమకు తెలియదని సమాధానం ఇస్తున్నారు.

గుడినీ వదలని ప్రచారం పిచ్చి!

కశింకోట మండలం పరవాడపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం, రామాలయానికి కూడా గురునాథరావు పేరు పెట్టడం విచిత్రంగా వుంది. ఈ గ్రామంలో రామ్‌కో సిమెంట్ కంపెనీ ... మిగతా 8వ పేజీలో

డీఎస్సీ అభ్యర్థుల్లో ఆందోళన



టెట్, డీఎస్సీ వెంటవెంటనే నిర్వహించడంపై అభ్యంతరం

- ప్రభుత్వ తీరుపై మండిపాటు
- రెండింటి మధ్య కనీసం నెల రోజులు వ్యవధి ఉండాలని విజ్ఞప్తి
- వచ్చే నెల 14న టెట్ ఫలితాలు, 15 నుంచి డీఎస్సీ
- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తోందన్న ఉద్దేశంతోనే హడావుడి చేస్తున్నట్టుందని అభిప్రాయం
- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్న నిరుద్యోగ జేఏసీ కన్వీనర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం తగినంత వ్యవధి ఇవ్వకుండా టెట్, డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధం కావడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వేర్వేరు సిలబస్ అయినందున రెండు పరీక్షల మధ్య కాస్త సమయం ఉండాలని, కానీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తోందన్న ఉద్దేశంతో వెంటవెంటనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందని మండిపడుతున్నారు. టెట్‌లో ఉత్తీర్ణులైనవారే డీఎస్సీ రాసేందుకు అర్హులు. అందువల్ల టెట్‌కు కూడా ప్రాధాన్యం ఉంది. ఇంకా ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకూ వెయిటేజీ ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ రాసే అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకం. అయితే టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వం తొందరపాటుతో వ్యవహరిస్తోందని అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టెట్‌కు హాజరుకానున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే 27వ తేదీ నుంచి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు రాత పరీక్ష నిర్వహిస్తారు. ఫలితాలు వచ్చే నెల 14న విడుదల చేస్తారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తరువాతే డీఎస్సీ పరీక్షకు షెడ్యూల్ ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య కనీసం నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలి. కానీ వైసీపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 14న టెట్ ఫలితాలు వెలువడిన మరుసటిరోజు అంటే 15వ తేదీ నుంచి డీఎస్సీ రాత పరీక్షల నిర్వహణ ప్రారంభమవుతుంది. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 12న ప్రారంభమై 22తో ముగియనున్నది. టెట్, డీఎస్సీ పరీక్షల సిలబస్ వేర్వేరుగా ఉంటుంది. టెట్‌లో ఉత్తీర్ణత సాధించడంతోపాటు మంచి మార్కులు వస్తేనే డీఎస్సీలో పోస్టు కొట్టేందుకు అవకాశం ఉంటుంది. అందువల్ల టెట్, డీఎస్సీ పరీక్ష మధ్య సమయం ఇవ్వకపోతే ఎలా?...అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 27వ తేదీ టెట్, వచ్చే నెల 15వ తేదీ నుంచి డీఎస్సీ నిర్వహించబోతున్నారని...ఇంత తక్కువ వ్యవధిలో రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కాగలమని అడుగుతున్నారు. ఆరేళ్ల తరువాత నిర్వహించనున్న డీఎస్సీకి తీవ్రమైన పోటీ ఉండనున్నందున అభ్యర్థులు ప్రణాళికాయుతంగా ప్రిపేర్ కావాలంటే తగినంత సమయం ఉండాలని డైట్ రిటైర్డు లెక్చరర్ ప్రభాకరరావు అభిప్రాయపడ్డారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఇవ్వకపోతే అభ్యరులు తీవ్ర ఒత్తిడికి గురవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం, డీఎస్సీ షెడ్యూల్‌లో మార్పులు చేయాలని కోరుతూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ హేమంత్‌కుమార్ స్పష్టంచేశారు. ఇంకా డీఎస్సీలో పోస్టులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆశ వర్కర్ల నిర్బంధం తగదు

ఆశ కార్యకర్తలపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అనకాపల్లి, నర్సీపట్నం, అచ్యుతాపురం, తదితర ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకోవడానికి అమరావతి వెళుతున్న ఆశ కార్యకర్తలను దారిలో వాహనాల్లో నుంచి దించేసి పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. ఆశ కార్యకర్తల ఇళ్లకు పోలీసులు వెళ్లి నోటీసులు ఇవ్వడం తగదని, ఇటువంటి అణచివేత చర్యలకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. - 7లో



అనకాపల్లిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

మెగా డీఎస్సీ ప్రకటించాలి



అనకాపల్లిలో అర్ధనగ్నంగా రాస్తారోకో చేస్తున్న డీవైఎఫ్ఐ ప్రతినిధులు

- 7లో

మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ కార్యకర్తలు గురువారం అనకాపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నెహ్రూచౌక్ వరకు అర్ధనగ్నంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో 25 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నాయని, కానీ ప్రభుత్వం 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. మొత్తం అన్ని పోస్టుల భర్తీకి మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలని, 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఓటుతో వైసీపీకి గుణపాఠం చెప్పాలి

ఐదేళ్ల నుంచి రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది

- దోచుకోవడం, దాచుకోవడమే వైసీపీ నేతల పని
- జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు ధ్వజం
- 'ఎలమంచిలి' పార్టీ శ్రేణులతో ఆత్మయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు. వేదికపై పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు బ్రదర్స్, తదితరులు

రాంబిల్లి, ఫిబ్రవరి 8: ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసిన వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని హరిపురంలో జనసేన పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి నియోజకవర్గం జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదేళ్ల నుంచి ఆరాచక పాలన సాగుతున్నదని, వైసీపీ పాలకులు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమిలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధాలను ప్రశ్నించే వారిపై దాడులు చేయడం, వ్యక్తి జీవితాల గురించి చెడుగా మాట్లాడడం తప్ప, ప్రశ్నించిన వారికి సరైన సమాధానం చెప్పే ధైర్యం జగన్‌రెడ్డి ప్రభుత్వానికి లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, సమస్యలు తాండవిస్తున్నాయని అన్నారు. ఎస్ఈజడ్, నేవల్‌బేస్ ఏర్పాటుతో నిర్వాసితులైన ప్రజల సమస్యలు పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని విమర్శించారు. పరిశ్రమలకు భూములు ఇచ్చిన నిర్వాసితులైన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఇక్కడి ఎమ్మెల్యే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే శారదా నదిపై శిథిలావస్థలో ఉన్న ఆనకట్టలను ఆధునీకరించకపోవడం బాధాకరమన్నారు. ఎలమంచిలిలో 15 సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించిన రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం ఇంతవరకు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని స్థానిక ఎమ్మెల్యేను ఉద్దేశించి అన్నారు..సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రానికి వైరస్‌లా తగులుకున్నారని ఆరోపించారు. ఇటువంటి దుర్మార్గపు పాలన నుంచి బయటపడాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎలమంచిలి నియోజకవర్గంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతానని నాగబాబు తెలిపారు. ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, ఎలమంచిలి నియోజకవర్గంలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా జనసైనికులు పనిచేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్ ఎలమంచిలి నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, స్థానిక ఎమ్మెల్యే తీరుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను నాగబాబు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్, జడ్‌పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల అధ్యక్షులు బైలపూడి రామదాసు, పప్పల నూకన్నదొర, పార్టీ నాయకులు లాలం చందు, మోటూరి త్రివేణి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అచ్యుతాపురం నుంచి హరిపురం పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

అరకులోయ, ఫిబ్రవరి 8: కొత్తవలస-కిరండోల్ (కేకే) రైల్వే లైనులో చిమిడిపల్లి స్టేషన్ సమీపంలో 70/28 కిలోమీటరు వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చోటుచేసుకుంది. దీంతో కేకే లైనులో గూడ్స్ రైళ్ల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోగా, విశాఖపట్నం నుంచి కిరండోల్ వెళ్లే పాసింజరు రైలు ఆలస్యంగా నడిచింది. ఉదయం పది గంటలకు అరకులోయ రావాల్సిన పాసింజర్ సాయంత్రం నాలుగు గంటలకు వచ్చింది. రైల్వే ఉన్నతాధికారులు..సిబ్బందితో అక్కడకు చేరుకుని మధ్యాహ్నం మూడు గంటలకల్లా ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు.



చిమిడిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

ఖాళీ స్థలాల పన్ను మదింపునకు యజమానులు నిరీక్షణ

జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో పేరుకుపోతున్న వీఎల్‌టీ దరఖాస్తులు





వీఎల్‌టీ మదింపు కోసం దరఖాస్తులు పెండింగ్‌లో వున్న ఖాళీ స్థలాలు

- రెండు వారాల క్రితం జోనల్ కమిషనర్ బదిలీ
- డిజిటల్ సైన్ కీ లాగ్‌అవుట్
- అమలాపురం నుంచి కొత్త జోనల్ కమిషనర్ రాక
- ఇంతవరకు లాగిన్ కాని డిజిటల్ సైన్ కీ
- కార్యాలయం చుట్టూ దరఖాస్తుదారులు ప్రదక్షిణ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఇళ్లు, ఖాళీ స్థలాలకు ఆస్తి పన్నులు చెల్లించాలని స్థానిక సంస్థల అధికారులు, ఆయా యజమానులకు నోటీసులు జారీ చేస్తుంటారు. సకాలంలో చెల్లించకపోతే అపరాధ రుసుము (వడ్డీ) కూడా విధిస్తుంటారు. కానీ జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. 'ఖాళీ స్థలాలకు పన్నులు (వీఎల్‌టీ) చెల్లించడానికి తాము సిద్ధంగా వున్నాం. ఎంత చెల్లించాలో నోటీసులు ఇవ్వండి మహాప్రభో' అంటూ స్థలాల యాజమానులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో ఖాళీ స్థలాలకు పన్ను విధింపులో మునిసిపల్ రెవెన్యూ విభాగం అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఎన్నికల బదిలీల హడావుడిలో డిజిటల్ సైన్ కీ ఇంకా రాలేదంటూ ఖాళీ జాగాలకు పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) చెల్లించేందుకు భూయజమానులు ఆన్‌లైన్‌లో పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో వీఎల్‌టీ విధింపు కోసం దరఖాస్తు పెట్టుకున్న అనేక మంది కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో భూముల విలువ గణనీయంగా పెరిగిపోవడంతో ఖాళీ జాగాలపై కన్నేసిన కబ్జాదారులు.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించి వాటిని ఆక్రమించుకుంటున్నారు. దీంతో స్థలాలను రక్షించుకునేందుకు యజమానులు వీఎల్‌టీ చెల్లించడానికి ముందుకు వస్తున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో జీవీఎంసీకి దరఖాస్తు చేసుకుంటున్నారు. భూ యజమాని రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఈసీ, లింకు డాక్యుమెంట్, మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే.. సంబంధిత అధికారులు వీటిని పరిశీలించి క్షేత్రస్థాయిలో సర్వే చేస్తారు. అన్నీ సక్రమంగా వుంటే ఖాళీ స్థలానికి ఒక అసెస్‌మెంట్ నంబరు జారీ చేస్తారు. దీని ఆధారంగా భూమి మార్కెట్ విలువపై 0.5 శాతాన్ని వీఎల్‌టీగా విధిస్తారు. సంబంధిత భూ యజమాని ఏడాదికి ఒకసారి ఈ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు అనకాపల్లిలోని ఒక వార్డులో రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల ప్రకారం గజం రూ.15 వేలు వుంటే, వంద గజాలు రూ.15 లక్షలు విలువ చేస్తుంది. దీనిపై ... మిగతా 8వ పేజీలో

లోపూడిలో పడకేసిన అభివృద్ధి

అసంపూర్తిగా సచివాలయం, ఆర్‌బీకేల భవన నిర్మాణాలు

- బిల్లులు మంజూరు కాకపోవడంతో రెండేళ్ల క్రితం పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- చిన్నపాటి అద్దె భవనాల్లో కార్యాలయాలు
- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, ప్రజలు
- పునాది గోతులకే పరిమితమైన ఆరోగ్య ఉప కేంద్రం భవనం
- వృథాగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం
- ఊరు చివర రహదారి పక్కన చెత్త డంపింగ్
- ఎస్సీ కాలనీలో రెండేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోని తాగునీటి పథకం మోటారు


పునాది గోతులు దాటని ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 8: మండలంలోని లోపూడి పంచాయతీలో అభివృద్ధి పనులు పూర్తిగా పడకేశాయి. మూడున్నరేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకేల భవనాలు ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. లోపూడి శివారు బంగారుమెట్టలో ఆరోగ్య ఉప కేంద్రం భవనం పునాదుల్లోనే ఆగిపోయింది. ఇక్కడే ఎస్సీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం మోటారు రెండేళ్ల క్రితం పాడైపోయింది. ఇంతవరకు బాగుచేయించలేదు. చెత్త నుంచి సంపద తయారీకి గత ప్రభుత్వ హయాంలో కేంద్రం నిర్మించగా, దానిని నిరుప యోగంగా వుంచేశారు. వీధుల్లో సేకరించిన చెత్తను గ్రామం చివర రోడ్డు పక్కనే పడేస్తున్నారు.


బంగారుమెట్ట ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు

బిల్లులు రాక.. ఆగిన భవనాలు

లోపూడి పంచాయతీలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రానికి భవనాలు నిర్మించడానికి మూడేళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయి. రెండు అంతస్థులతో సచివాలయం భవన నిర్మాణ పనులు మొదలుపెట్టారు. శ్లాబులు, గోడల నిర్మాణం పూర్తయ్యింది. బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. సుమారు రెండేళ్ల నుంచి పనుల్లో ఎటువంటి కదలిక లేదు. రైతు భరోసా కేంద్రం పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా వుంది. గ్రామ సచివాలయం, ఆర్‌బీకేలు చిన్నపాటి అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. సచివాలయానికి వసతి చాలకపోవడంతో కొంతమంది ఉద్యోగులు భవనం ఆవరణలో చెట్టు కింద విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయంలో వివిధ పనుల కోసం వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


చిన్నపాటి అద్దె భవనంలో నడుస్తున్న గ్రామ సచివాలయం

లోపూడి శివారు బంగారుమెట్టలో ఆరోగ్య ఉప కేంద్రం (వెల్‌నెస్ సెంటర్) భవన నిర్మాణానికి ఏడాది క్రితం పనులు మొదలుపెట్టారు. అయితే అప్పటికే సచివాలయం, ఆర్‌బీకేలకు భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడం, వెల్‌నెస్ సెంటర్ భవనం నిర్మాణ పనుల టెండర్ పొందిన కాంట్రాక్టర్.. పునాదులకు గోతులు తీసి వదిలేశారు.


అసంపూర్తిగా గ్రామ సచివాలయం భవనం.. రెండేళ్ల నుంచి ఇదే పరిస్థితి

బంగారుమెట్టలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తెలుగుదేశం హయాంలో నిర్మించారు. కానీ పంచాయతీ అధికారులు దీనిని వినియోగించకుండా నిరుపయోగంగా వదిలేశారు. వీధుల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని ఊరు చివర రోడ్డు పక్కన పడేస్తున్నారు. చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు.

బంగారుమెట్ట ఎస్సీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం మోటారు రెండేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. ఇంతవరకు బాగు చేయించకపోవడంతో తాగునీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


బంగారుమెట్టలో ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

క్రైం... crime news

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

» రేవుపోలవరం సముద్ర తీరం వద్ద మృతదేహం


రేవుపోలవరం సముద్రతీరం వద్ద సత్యనారాయణ మృతదేహం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 8: మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరం వద్ద గురువారం ఉదయం ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది వున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రేవుపోలవరం సముద్ర తీరం వద్ద ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రదేశానికి వెళ్లారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో, మృతదేహం ఫొటో వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. దాని ద్వారా అతను అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గైపూరి సత్యనారాయణ(40)గా గుర్తించారు. దీంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అది సత్యనారాయణ మృతదేహంగా నిర్ధారించారు. బుధవారం సాయంత్రం ఫోన్ చేసి ఎక్కడున్నావని అడిగితే రేవుపోలవరం సముద్ర తీరం వద్ద ఉన్నట్టు సత్యనారాయణ బదులిచ్చాడని అతని కుటుంబ సభ్యుడు తెలిపారు. కాగా సత్యనారాయణ ఒంటిపై డ్రాయర్ తప్ప ఆ చుట్టు పక్కల అతని దుస్తులు గాని, ఫోన్ గాని లేకపోవడం, అక్కడ బైక్ తప్ప ఇంకేమి లేకపోవడంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. వారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సత్యనారాయణకు వివాహం కాలేదని, తన సోదరుడితో కలిసి పని చేస్తుంటాడని ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగొద్దని తల్లి మందలించిందని ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 8: అతిగా మద్యం సేవించవద్దని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో ఎల్.సింగవరం గ్రామానికి చెందిన సాయికుమార్(22) ఏ పనిచేయకపోగా మద్యానికి అలవాటుపడ్డాడు. దీంతో అతిగా మద్యం సేవిస్తే ఆరోగ్యం పాడవుతుందని తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సాయికుమార్ బుధవారం వడ్డాది రెవెన్యూ పరిధిలోని ఒక సరుగుడు తోటలోకి వెళ్లి గడ్డి నివారణకు వాడే రసాయన మందు తాగాడు. అపస్మారక స్థితిలో వున్న ఇతనిని సమీపంలోని రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఇతని సోదరుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనుల్లో మార్గదర్శకాలు పాటించలేదు

» డ్వామా అధికారులపై కేంద్ర బృందం అసహనం


తాటిపర్తిలో కందకం పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

రావికమతం, ఫిబ్రవరి 8: జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో కేంద్ర ప్రభుత్వ నినిర్దేశించిన మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో పాటించలేదంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బృందం, స్థానిక అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేసింది. ఢిల్లీ నుంచి వచ్చిన సంజోలి గుప్తా, అజయ్ పల్లేతోపాటు ఇతర అధికారుల బృందం మండలంలోని చీమల పాడు పంచాయతీ తాటిపర్తి, టి.అర్జాపురం గ్రామాల్లో పర్యటించారు. తాటిపర్తిలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన మట్టిరోడ్డు, కందకాల తవ్వకం పనుల పరిశీలించారు. ఉపాధి హామీ పథకం మార్గదర్శకాలను ఎందుకు పాటించలేదని స్థానిక అధికారులను, సిబ్బందిని ప్రశ్నించారు. కొండప్రాంతం కావడంతో పనుల వివరాలను అప్‌లోడ్ చేయడానికి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. అనంతరం పనులు చేసే ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న సమస్యల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు చేయాలంటే ఎవరిని అడుగుతారు, ఏటా 150 రోజులపాటు పనులు కల్పిస్తున్నారా, ఏయే పనులు చేస్తున్నారు, ఈ పనులు గ్రామానికి, మీకు ఎంతమేర ఉపయోగపడుతున్నాయి, రోజుకు ఎంత కూలి వస్తున్నది.. తదితర వివరాలు అడిగారు. వారంలో ఏడు రోజులు పనులు చేస్తే నాలుగు రోజులు మస్తర్లు వేస్తున్నారని పలువురు కూలీలు చెప్పగా, దీనిపై డ్వామా సిబ్బందిని కేంద్ర బృందం ప్రశ్నించింది. ఇది కొండ ప్రాంతం కావడంతో నిర్దిత కొలతల ప్రకారం పనులు చేయలేకపోతున్నారని, అందువల్ల ఏడు రోజుల పనిని నాలుగు రోజులకు లెక్కకట్టి రోజుకు రూ.250 వరకు కూలి వచ్చేలా చేస్తున్నామని సిబ్బంది బదులిచ్చారు. తమ జీడిమామిడి తోటల్లో తుప్పలు తొలగింపు, రింగ్ ట్రెంచ్ పనులను ఉపాధి పథకం కింద చేసుకునే అవకాశం కల్పించాలని తాటిపర్తికి చెందిన పలువురు గిరిజనులు కోరారు. పొలం గట్లు, రింగ్‌ట్రెంచ్‌ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఇ.సందీప్, ఎలమంచిలి, అనకాపల్లి,మాడుగుల క్లస్టర్ల ఏపీడీలు శ్రీనివాస్, మణికుమార్, శ్రీనివాస్, ఏపీవో వెంకటప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో బ్రాహ్మణ శంఖారావం రేపు

చోడవరం, ఫిబ్రవరి 8: రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన చోడవరంలో బ్రాహ్మణ శంఖారావం సభ నిర్వహిస్తున్నట్టు బ్రాహ్మణ సంఘటన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అందుకూరి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ముక్కవిల్లి సీతారామమూర్తి తెలిపారు. ఈ సమావేశానికి బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతోపాటు, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్టు పేర్కొన్నారు.

కేకే లైన్‌లో డబ్లింగ్ పనులపై డీఆర్‌ఎం సమీక్ష


పనులపై అధికారులతో చర్చిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస - కిరండోల్ (కేకే) లైనులో డబ్లింగ్ పనులపై డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ సీనియర్ అధికారులతో కలిసి గురువారం తనిఖీలు నిర్వహించారు. అరకులో అమృత్ స్టేషన్ పనులను పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. 12 మీటర్ల వెడల్పున నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి స్థలాన్ని పరిశీలించారు. దర్లిపుట్ స్టేషన్‌లో భద్రత అంశాలను పరీక్షించారు. స్టేషన్ మాస్టర్ భవనంలో వెలుతురు కోసం పలు సూచనలు ఇచ్చారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

మెగా డీఎస్సీ కోసం డీవైఎఫ్ఐ ఆందోళన

» నెహ్రూచౌక్‌లో అర్ధ నగ్నంగా రాస్తారోకో, భిక్షాటన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8: మెగా డీఎస్సీ కోసం డీవైఎఫ్ఐ నాయకులు గురువారం వినూత్నరీతిలో ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నెహ్రూచౌక్ వరకు అర్ధనగ్నంగా నిరసన ప్రదర్శన చేపట్టి నెహ్రూచౌక్‌లో రాస్తారోకో చేశారు. అలాగే భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ సమయం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిరుద్యోగులను భిక్షమెత్తుకునేలా చేసిందని ఆరోపించారు. డీఎస్సీ పోస్టులను 25 వేలకు పెంచి మెగా డీఎస్సీని విడుదల చేయాలని, 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, కార్యదర్శి ఎస్‌వీ నాయుడు మాట్లాడుతూ మెగా డీఎస్సీ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, కేవలం 6100 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరైన నిర్ణయం కాదన్నారు. అలాగే అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు నాని, దేముడు, తరుణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రభూమి ప్రహరీ గోడ నిర్మాణ పనులు నిలిపివేత

అచ్యుతాపురం, ఫిబ్రవరి 8: ఆవరాజాం రుద్రభూమి చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని ఆపాలని రెవెన్యూ అధికారులు గ్రామపెద్దలను ఆదేశించారు. ఆవరాజాం రుద్రభూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. రుద్రభూమికి ప్రహరీ సాకుతో గ్రామ పెద్దలు ఒక రియల్టర్‌కి మేలు చేకూరే విధంగా చర్యలు చేపట్టారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 'రుద్రభూమి నుంచి రియల్టర్ రోడ్డు' శీర్షికన ఈ నెల 5న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై ఆర్ఐ సోమేష్‌కుమార్ విచారణ జరిపి ప్రహరీని వెంటనే ఆపాలని గ్రామ పెద్దలను ఆదేశించారు. పాఠశాలతో పాటు గ్రామ ప్రధాన రహదారిని అనుకొని రుద్రభూమి ఉందని ఆర్జీ పెడితే గ్రామానికి దూరంగా రుద్రభూమికి స్థలాన్ని కేటాయిస్తామని గ్రామ పెద్దలకు తెలిపారు. రుద్రభూమి చుట్టూ ప్రహరీ నిర్మిస్తే కూల్చివేస్తామని హెచ్చరించారు. దీంతో రుద్రభూమికి ప్రహరీ నిర్మాణం నిలిచిపోయింది.

అల్లూరి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

» రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు


అల్లూరి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 8 : రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు గురువారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు, గంటందొరల సమాధులను సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిటీష్ పాలకులపై చిన్న వయస్సులోనే వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగంచేసిన గొప్పవ్యక్తి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అటువంటి మహనీయులను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. పార్కులో సమస్యల పరిష్కారానికి, మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట నర్సీపట్నం ఆర్‌డీవో హెచ్‌వీ జయరామ్, ఇన్‌చార్జి తహసీల్దారు ఆనంద్, టీడబ్ల్యూఏ వి.నాగశిరీషా, వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి, తదితరులు వున్నారు.

ఆశ కార్యకర్తల ఆందోళన

» ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8: జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలపై పోలీస్ నిర్బంధాన్ని ఖండిస్తూ గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. రాస్తారోకో చేసి నిరసన తెలియజేశారు. ఆశ కార్యకర్తలను నిర్బంధించి భయ భ్రాంతులకు గురిచేయడం తగదని వక్తలు పేర్కొన్నారు. నక్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాగిత టోల్‌గేటు వద్ద అరెస్టు చేసిన ఆశ కార్యకర్తలను బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు రోడ్డుపై ఉంచడం దారుణమన్నారు. కనీసం మహిళా పోలీసులు లేకుండా పురుష పోలీసులను కాపలా పెట్టడం ఘోరమన్నారు. ఆశ కార్యకర్తలు విపరీతమైన పనిభారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేసేందుకు వెళుతున్న వారిని నిర్బంధించడం హక్కులను హరించడమేనని, రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, కోశాధికారి శ్రీనివాసరావు, ఆశ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు సూర్యకళ, భవాని, నాగమణి, వెంకటలక్ష్మి, గోవింద తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత ప్లాంట్‌గా ఎన్‌టీపీసీ సింహాద్రి

» ప్లాంట్‌లో కాలుష్యస్థాయి తగ్గింపునకు చర్యలు
» త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
» ఎన్‌టీపీసీ సింహాద్రి బీయూహెచ్ సంజయ్‌కుమార్ సిన్హా



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టీపీసీ సింహాద్రి ప్రాజెక్టు బిజినెస్ యూనిట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా

అనకాపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత ప్లాంట్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నామని, ఎన్‌టీపీసీ సింహాద్రి ప్రాజెక్టు ఆధ్వర్యంలో త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్టు ఎన్‌టీపీసీ సింహాద్రి బిజినెస్ యూనిట్ హెడ్ (బీయూహెచ్) ప్రాజెక్టు సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. ప్లాంట్‌లో కాలుష్య స్థాయిని తగ్గించేందుకు అవసరమైన అన్నిరకాల చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గురువారం గాజువాకలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరవాడలో ఎన్‌టీపీసీ సింహాద్రి ప్రాజెక్టును పర్యావరణహిత ప్లాంట్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఎంఓయూలో భాగంగా త్వరలోనే ప్రతిష్ఠాత్మక గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. దీనికి సంబంధించి వివిధ దేశాలకు చెందిన నిపుణులతో కన్సల్టెన్సీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్లాంట్‌లో కాలుష్యస్థాయిలను తగ్గించేందుకు చేపట్టిన హరితహారంలో భాగంగా నాలుగు ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే యూనిట్-4లో ఒక ఎఫ్‌జీడీ ఏర్పాటు చేశామని, మిగిలిన మూడు యూనిట్లు ఈ ఏడాది అక్టోబరు నాటికల్లా పూర్తిచేస్తామని వివరించారు. ఈ నాలుగు యూనిట్లలో ఎఫ్‌జీడీలు ఏర్పాటుచేసిన తరువాత సల్ఫర్ డయాక్సైడ్ స్థాయిలు 90 నుంచి 95 శాతం తగ్గుతాయని తెలిపారు. ఇప్పటికే సమీప గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పునరుత్పాదక ఇంధన వనరులతో వీధి దీపాల్ని కూడా ఏర్పాటుచేశామన్నారు. త్వరలోనే ఎన్‌టీపీసీకి సంబంధించిన అన్ని భవనాలపైన రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటుచేసి 2.1 మెగావాట్ల విద్యుత్పత్తికి ప్రణాళికలు సిద్ధంచేశామని తెలిపారు. బూడిద (ఫ్లైయాష్) నిర్వహణ విషయంలో 100 శాతం సఫలీకృతమవుతున్నామని, చుట్టుపక్కల గ్రామాలకు బూడిద కాలుష్యం వెళ్లకుండా చర్యలు చేపట్టామన్నారు. పిట్టవానిపాలెంలో కాలుష్యానికి సంబంధించిన కేసును నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కొట్టివేసినట్టు ఆయన తెలిపారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న తరుణంలో ప్లాంట్ సామర్థ్యానికి అనుగుణంగా ఉత్పత్తి పెంచేలా టార్గెట్ నిర్దేశించుకున్నామని ఆయన చెప్పారు. దేశంలో 8 నుంచి 10 శాతం విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. ప్రస్తుతం ప్లాంట్‌లో 65-70 శాతం విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, 2024-25లో 75 శాతం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం బొగ్గు కొరత అనేది లేదని, ఉత్పత్తికి అవసరమైన నిల్వలు ఉన్నాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా చేసే విషయంలో ఎన్‌టీపీసీ కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ సమావేశంలో ఓ అండ్ ఎం జీఎం డీపీ పాత్రా, ఆపరేషన్స్ జీఎం టీఆర్ రాజగోపాలన్, టెక్నికల్ సర్వీసెస్ జీఎం పద్మప్రియ, హెచ్ఆర్ హెడ్ బీబీ పాత్రా, ఏజీఎం డాక్టర్ విజయన్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు వాస్తవమే

» పరిష్కరించాలని ప్రభుత్వానికి నివేదిస్తా
» రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు
» జోగంపేట హాస్టల్‌లో కరెంట్ షాక్‌తో మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి పరామర్శ
» వసతిగృహం సందర్శన.. అధ్వానంగా ఉందని అధికారులపై అసహనం


జోగంపేట హాస్టల్‌లో విద్యుదాఘాతంతో మృతిచెందిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

గొలుగొండ, ఫిబ్రవరి 8: సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, వాటిని పరిష్కరించాలని ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు చెప్పారు. ఈ నెల 4వ తేదీన పాతమల్లంపేట పంచాయతీ శివారు బుడ్డడపాడు గ్రామానికి చెందిన దావీద్‌రాజ్(12) అనే గిరిజన విద్యార్థి విద్యుదాఘాతంతో మృతిచెందిన జోగంపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహాన్ని ఆయన గురువారం సందర్శించారు. గదుల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లను పరిశీలించారు. హాస్టల్ గదుల్లో విద్యుత్ వైరింగ్ అస్తవ్యస్తంగా వుందని, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా వుందని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మృతిచెందిన విద్యార్థి స్వగ్రామం బుడ్డడపాడు వెళ్లారు. బాలుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరుకు కృషిచేస్తానని చెప్పారు. విద్యుత్ షాక్ కారణంగా విద్యార్థి మరణానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బుడ్డడపాడులో ఎన్నోఏళ్లుగా ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు జి.రాధాకృష్ణ, వివిధ సంఘాల నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, అడిగర్ల రాజు, తదితరులు స్థానిక గిరిజనులతో కలిసి ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్‌డీవో జయరామ్, డీటీ ఆనందరావు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, నాయకులు లెక్కల సత్యనారాయణ, లోచల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 8: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్ తెలిపారు. 1-2 ఏళ్ల పిల్లలకు సగం మాత్రను, 2-3 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. మూడు నుంచి 19 ఏళ్లలోపు వారు మాత్రను పూర్తిగా చప్పరించేటట్టు చూడాలన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తరువాత మాత్ర వేయాలన్నారు.

ఇంటి స్థలాన్ని లాగేసుకున్నారు

» వైసీపీ నాయకులు కక్ష సాధింపు
» వితంతువు ఆవేదన.. న్యాయం చేయాలని వినతి


ఇంటి స్థలం పట్టా చూపుతున్న కనక

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 8: వైఎస్సార్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా అధికారులు తనకు 72.6 చదరపు గజాల స్థలానికి పట్టా ఇచ్చి వైసీపీ నాయకుల ప్రోద్బలంతో తిరిగి తీసేసుకున్నారని ఓ వితంతువు ఆవేదన వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయడం లేదని వాపోయింది. దీనికి సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని ఖాజీపాలేనికి చెందిన నిరుపేద మహిళ గనిశెట్టి కనక.. భర్త మృతి చెందడంతో కుమార్తెతో నివాసముంటోంది. వైఎస్సార్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఆమె స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా స్థలం పట్టాను అందజేశారు. అయితే ఆమె గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయలేదనే నెపంతో వైసీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆమెకు ఇచ్చిన పట్టాను తిరిగి తీసేసుకున్నాడు. దీంతో ఆమె పట్టా జెరాక్స్ కాపీలతో అధికారుల వద్దకు వెళ్లి వేడుకున్నా ఫలితం లేకపోయింది. గత ఏడాది జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌ను కలిసి తన పరిస్థితిని తెలియజేసింది. సీఎం వెంటనే స్పందించి ఆమెకు పట్టాను తిరిగి ఇవ్వాలని, స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అయితే అధికారులు ఇప్పటి వరకు ఆమెకు పట్టాను తిరిగి ఇవ్వలేదు. పైగా ఆ స్థలంలో వైసీపీ నాయకులు నిర్మాణానికి పూను కున్నారు. సీఎం ఆదేశించినా అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు కనక వేడుకుంటోంది.

'బైపాస్‌లో గడ్డర్‌ను ఏర్పాటు చేయాలి'

మునగపాక, ఫిబ్రవరి 8: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డులో భారీ వాహనాలు ప్రవేశించకుండా బైపాస్ జంక్షన్‌లో గడ్డర్‌ను ఏర్పాటు చేయాలంటూ రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ సభ్యులు గురువారం ఎస్ఐ బి. ప్రసాదరావును కలసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్‌లో భారీ వాహనాలు ప్రవేశించరాదంటూ ఆర్అండ్‌బీ అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినా వాహనాలు తిరుగుతుండడంతో రోడ్డు మరింత పాడయ్యిందన్నారు. గడ్డర్ ఏర్పాటు చేయడం వలన భారీ వాహనాల రాకకు చెక్ పడుతుందని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు ఆళ్ల మహేశ్వరరావు, కాండ్రేగుల సదాశివరావు, మొల్లేటి సత్యనారాయణ, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

'యోగా సాధనతో ఆరోగ్యం మేలు'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : యోగా సాధనతో ఆరోగ్యం ఎంతో బాగుంటుందని జిల్లా మహిళా పతాంజలి యోగా అధ్యక్షురాలు, యోగా నిపుణులు ప్రభాసాహో పేర్కొన్నారు. స్థానిక జార్జి క్లబ్‌లో గురువారం భారత స్వాభిమాన ట్రస్ట్ నిర్వహణలో కొంత కాలంగా యోగా శిక్షణ తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాసాహో మాట్లాడుతూ యోగా సాధనతో మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పతాంజలి యోగా సమితి భారత స్వాభిమాన ట్రస్టు జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరంనాయుడు, కాండ్రేగుల చిన్న, కొణతాల పెద్ద, కోలపర్తి కన్నబాబు, బీఎస్ఎంకే జోగినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అనకాపల్లి పీటీడీ డీపీటీవో కె.పద్మావతి ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల్లో సందేశాత్మక చిత్రాలను గీసిన పది మందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎం సుజాత, ఏడీఎం రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు మొండి చేయి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : రాష్ట్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు మొండి చేయి చూపడం దారుణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. వైసీపీ హయాంలో తీసుకువచ్చిన ప్రతీ స్కీమ్ ఓ స్కామ్‌గా మారిపోయిందన్నారు. ఆర్థికమంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెలగారడీగా ఉందన్నారు. పన్నులు పెంచడం తప్ప బడ్జెట్‌లో పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు.

'ఆశ కార్యకర్తలను నిర్బంధించడం దారుణం'

పరవాడ, ఫిబ్రవరి 8: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ నిర్వహించిన ఆశ వర్కర్లను పోలీసులు నిర్బంధించడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదముషిడివాడ, వెన్నెలపాలెం గ్రామాల్లో గల సచివాలయాల్లో ఆశ వర్కర్లను మహిళా పోలీసులచే నిర్బంధించడం అన్యాయమన్నారు. ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు.

అన్ని అనుమతులతోనే భవన నిర్మాణం : పలకా రవి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : జీవీఎంసీ నుంచి అన్ని అనుమతులు పొందే తాను ఇంటి నిర్మాణం చేపడుతున్నామని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పలకా రవి అన్నారు. జీవీఎంసీ ఎదుట రవి కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి నిర్మాణంపై వస్తున్న ఆరోపణలో వాస్తవం లేదన్నారు. అడిగిన డబ్బులు ఇవ్వలేదని కొంతమంది తనను, తన కుటుంబసభ్యులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని రవి చెప్పారు. ఆయన వెంట పలకా యశోధ, మాజీ కౌన్సిలర్ పలకా వరలక్ష్మి ఉన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడుకు వారు వినతిపత్రం అందజేశారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి : సీఐ

సబ్బవరం, ఫిబ్రవరి 8: ఎన్నికల తరుణంలో మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీఐ పిన్నింటి రమణ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం మహిళా పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ- ఎవరైన అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరించినా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండలంలోని అసకపల్లి, గంగవరం, వెదుళ్లనరవ, సబ్బవరం, బోదివలసల్లో 204 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అదేవిధంగా 40 మంది కేడీ, డీసీలపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : ఎంవీఐలు

సబ్బవరం, ఫిబ్రవరి 8 : రోడ్డు భద్రత నియమాలు పాటించని డ్రైవర్లపై చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు టి. రాజన్న, శివరామ్‌గోపాల్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో, లారీ డ్రైవర్లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లు డ్రైవ్ చేసిన వారు సీటు బెల్టు ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయరాదన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుకు వ్యతిరేకంగా కరపత్రాలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 8: ల్యాండ్ టైటిలింగ్ యాక్టుకు వ్యతిరేకంగా గురువారం ఎలమంచిలిలో న్యాయవాదులు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు కనకమహాలక్ష్మి ఆలయ సమీపంలోని వారపు సంతలో వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస పట్నాయక్ మాట్లాడుతూ ఈ చట్టంతో పేదలకు, సన్నకారు రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కూనిశెట్టి శ్రీనివాస్, న్యాయవాదులు లాలం రమణమూర్తి, దూళి నూకరాజు, టి.సత్యనారాయణ, ఎల్‌వీ.రామకృష్ణ, కె.ఆంజనేయులు, దొడ్డా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 8: మండలంలోని బంగారమ్మపాలెంలో ఉన్న వల్లబేశ్వరస్వామి వారి తీర్థం సందర్భంగా గురువారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 19 జట్లు పాల్గొనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. రాత్రి వరకు సాగిన ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అసెంబ్లీ ఎగ్గొట్టి సినిమాకు ఎమ్మెల్యేలు

తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 8: అసెంబ్లీ సమావేశాలు ఎగ్గొట్టి ఎమ్మెల్యేలు సినిమాలకు వెళ్లడం దౌర్భాగ్యమని తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెంటకోటలో గురువారం అనితమ్మ పల్లె పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకుని వైసీపీ ప్రభుత్వం అక్రమాలు, భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను వివరించారు. అనంతరం అనిత విలేకర్లతో మాట్లాడుతూ.. అభూత కల్పన సినిమా చూడడం కోసం కోరం లేకుండా వాయిదా పడడం అసెంబ్లీ చరిత్రలో లేదన్నారు. బడ్జెట్ మహిళా సమస్యలపై చర్చించాల్సిన విషయాలుండగా వారి నాయకుడికి సంబంధించిన సినిమాకు వెళ్లాలనే ఉద్దేశంతో అసెంబ్లీ వాయిదా వేశారంటే ఎంత దుర్మార్గమో ఆలోచించాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాల 9 నెలల కాలంలో అనేక అక్రమాలు, అన్యాయాలు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారన్నారు. అనంతరం పలువురికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, జానకి శ్రీను, పెదిరెడ్డి శ్రీను, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెదిరెడ్డి పండు, నాయకులు చిక్కాల శ్రీనివాసరావు, ఎం.రమాకుమారి కె. వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి బుజ్జి, కాశీ విశ్వనాథ్, వంకా రమణ తదితరులు పాల్గొన్నారు.



పెంటకోటలో భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను అందజేస్తున్న అనిత

గాంధీనగర్‌లో మున్సిపాలిటీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆందోళన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : గాంధీనగరంలోని సర్వే నంబరు 348లో మున్సిపాలిటీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ లిబరేషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ మున్సిపాలిటీ సిబ్బంది క్వార్టర్‌లో ఉన్న మాజీ ఉద్యోగి తమకు 532 గజాల స్థలం ఉన్నట్టుగా రిజిస్టర్ చేశారన్నారు. దీనిని కొంతమంది వ్యక్తులు కొనుగోలు చేసి జీవీఎంసీ నుంచి అనుమతులు తీసుకుని భవన నిర్మాణం ప్రారంభించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ విషయమై జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా నేటి వరకు విచారణ జరపలేదన్నారు. తక్షణమే దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



జోనల్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆందోళనకారులు

ఆందోళనలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ గత్యంతరం లేని పరిస్థితుల్లో లోకాయుక్తలో కేసు దాఖలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ అజయ్‌కుమార్, వైఎన్ భద్రం, గంటా శ్రీరామ్, దాసరి సంతోష్, బొడ్డేడ అప్పారావు, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

'పరిహారం చెల్లించేంత వరకు విశాఖ- చెన్నై కారిడార్ పనులు ప్రారంభించవద్దు'

నక్కపల్లి, ఫిబ్రవరి 8 : వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం చెల్లించేంత వరకు శంకుస్థాపనలు, నిర్మాణ పనులు చేపట్టవద్దని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బుచ్చిరాజుపేటలో నిర్వాసిత గ్రామాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులు, కూలీలు, దళితులకు చేతివృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు భూములు, చెట్లకు, నివాసాలకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించేంత వరకు ఏ విధమైన శంకుస్థాపనలు, నిర్మాణాలు చేపట్టవద్దని కోరారు. ఏపీఐఐసీ అధికారులు సమస్యలు పరిష్కరించకుండా గ్రామాల్లో విభజించి పాలించు పద్ధతుల్లో గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఏపీఐఐసీ రాష్ట్ర కమిషనర్, జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. వెంటనే అధికారులు గ్రామసభలు నిర్వహించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.వెంకటేష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, సర్పంచులు కాళ్ల శ్రీను, పెదహూడి శంకరరావు, ఉప సర్పంచులు జీ.తిరుపతిరావు, కొండలరావు, నాయకులు ఆర్.గోవిందరావు, బాబ్జీ, ఎస్.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యం : రెహమాన్

కశింకోట, ఫిబ్రవరి 8 : ముస్లింల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఆ పార్టీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ (బాబర్) అన్నారు. గురువారం బయ్యవరంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మసీదుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయడమే కాకుండా షాదీకానాలను నిర్మించడం జరుగుతుందన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సీహెచ్ ప్రసాద్, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ముస్లిం సోదరులు ఎస్.కె. బుఖారి, సయ్యద్ ఆయుష, సయ్యద్ మున్ని, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సహిదా బేగం, షేక్ ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ముస్లిం సోదరులు

ఆశ కార్యకర్తల నిర్బంధంపై సీఐటీయూ నిరసన

అచ్యుతాపురం, ఫిబ్రవరి 8: తమ కోర్కెలు సాధనకు చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వం నిర్బంధించడం సరైనది కాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ గురువారం విజయవాడలో జరిగే కార్యక్రమానికి వెళ్లకుండా ఆశ కార్యకర్తలతో పాటు సీఐటీయూ నాయకులను బుధవారం ఉదయం నుంచి నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాల్లో ఆశ కార్యకర్తల ఇళ్లకు పోలీసులు వచ్చి నోటీసులు జారీ చేయడంతో భయభ్రాంతులకు గురయ్యారన్నారు. ఆశ కార్యకర్తల న్యాయమైన కోర్కెలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాన్ని వెంటాడి పట్టుకున్న యువకులు

మునగపాక, ఫిబ్రవరి 8: డోర్ ఊడి ప్రమాదకరంగా వేలాడుతూ వేగంగా వెడుతున్న భారీ వాహనాన్ని మునగపాక యువకులు గురువారం వెంటాడి పట్టుకున్నారు. పెద్ద రాళ్లు వాహనంలో వేసుకుని అన్‌లోడ్ చేసిన తర్వాత బ్యాక్ డోర్ వేయలేదు. ఆ డోర్ రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు ఎవరికైనా తగిలితే ఎవరు బాధ్యులని డ్రైవర్‌ను నిలదీసారు. భారీ వాహనాల కారణంగా రోడ్డు గోతులు పడి ఇప్పటికే వాహనదారులు అవస్థలు పడుతున్నారని, ఇలాంటి డొక్కు వాహనాలతో మీరు ప్రజలను మరీ భయాభ్రాంతులకు గురి చేయడం సరి కాదన్నారు. మళ్లీ ఈ వాహనం కనిపిస్తే పట్టుకుని పోలీసులకు అప్పగించి సీజ్ చేయిస్తామంటూ హెచ్చరించి వదిలిపెట్టారు. అయినా ఇలాంటి వాహనాలు తిరుగుతుంటే రోడ్డు రవాణా శాఖ అధికారులు ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



వేలాడుతున్న డోర్‌ను చూపిస్తున్న యువకులు

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ

పాయకరావుపేట, ఫిబ్రవరి 8 : ప్రమాదాల నివారణకు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ పి.అప్పలరాజు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శ్రీప్రకాస్ విద్యా సంస్థలో జాతీయ రహదారి సిబ్బంది ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అప్పలరాజు మాట్లాడుతూ అతివేగం అనర్థాలకు దారితీస్తుందని, ట్రాఫిక్ నిబంధనలతోపాటు సేఫ్టీ పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం పలువురు డ్రైవర్లకు సీఐ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ఐఎంటీ మేనేజరు కె.సత్యనారాయణ, శ్రీప్రకాష్ విద్యా సంస్థల హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బంగార్రాజు, హైవే టోల్ మేనేజరు డీఏ.కృష్ణ, సేఫ్టీ మేనేజరు అశోక్‌కుమార్, అధిక సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు రాత్రిపూట అదనపు తరగతులు

నక్కపల్లి, ఫిబ్రవరి 8 : ఉత్తమ ఫలితాల సాధన కోసం పదో తరగతి విద్యార్థులకు మండలంలోని పెదబోదుగల్లం హైస్కూల్లో ఉపాధ్యాయులు రాత్రివేళల్లో కూడా అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. హెచ్ఎం సీహెచ్.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా స్వచ్ఛందంగా తరగతులను నిర్వహిస్తున్నారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ నిర్వహించే అదనపు తరగతులకు దాతలు, ఉపాధ్యాయులు ఆర్థిక సాయంతో అల్పాహారం కూడా అందిస్తున్నారు. తరగతులను ఉపాధ్యాయులు ఆచార్యులు, ఫల్గుణరావు, రమేష్‌బాబు, ఏవీఎల్ఎస్.కుమారి, చిన్నారావు, శ్రీదేవి నిర్వహిస్తున్నారు.

అనాథ శరణాలయానికి విద్యార్థుల విరాళాల సేకరణ

కోటవురట్ల, ఫిబ్రవరి 8: మండలం లింగాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు అనాథ శరణాలయానికి విరాళాలు సేకరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం పాల్వంచలో గల యువసేన అనాథ శరణాలయానికి విద్యార్థులు సేకరించిన విరాళాలను పంపిస్తున్నట్టు పాఠశాల హెచ్ఎం జవ్వాది నరసింగరావు, ఉపాధ్యాయులు తెలిపారు. మంచి ఆలోచనతో చేస్తున్న విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులను సర్పంచ్ కోరుప్రోలు గంగారత్నం, రుత్తల గోవింద, రమణ, ఎంపీటీసీ సభ్యులు అభినందించారు.

డీపీఎన్ పాఠశాలకు టేబుల్ టెన్నిస్‌బోర్డు వితరణ

కశింకోట, ఫిబ్రవరి 8: స్థానిక డీపీఎన్ జడ్పీ హైస్కూల్‌కు నర్సింగబిల్లి ఉపాధ్యాయుడు సురేష్‌కుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం టేబుల్ టెన్నిస్‌బోర్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఈ టీడీ.బోర్డుని సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఆర్‌వీ.అప్పారావు, ఉపాధ్యాయులు ఆచంట రవి, ఎన్‌జీవీ. ప్రసాద్, పీవీఆర్. ప్రభాకర్, వీడీ ప్రభాకర్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన ర్యాలీ

రాంబిల్లి, ఫిబ్రవరి 8: నులిపురుగుల నివారణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దిమిలి సర్పంచ్ బంగారు చిలుకు అన్నారు. గురువారం గ్రామంలో నులిపురుగుల నివారణ పోస్టర్‌ను విడుదల చేసి, స్థానిక విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్ఎస్‌వీఎస్ రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ ధనరాజు, హెచ్ఎం గాడి ప్రసాదరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా మత్స్యకార చైర్మన్‌గా సుభద్రరావు

రాంబిల్లి, ఫిబ్రవరి 8 : కాంగ్రెస్ పార్టీ జిల్లా మత్స్యకార చైర్మన్‌గా సుభద్రరావు నియమితులయ్యారు. మండలంలోని కొత్తపట్నం గ్రామానికి చెందిన ఈయనకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నియామక పత్రాన్ని అందజేశారు. సుభద్రరావుకు పలు మత్స్యకార నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభినందనలు తెలియజేశారు.

సీహెచ్‌సీలో కరెంట్ లేక రోగుల ఇక్కట్లు

ఎలమంచిలి, ఫిబ్రవరి 8 : స్థానిక సీహెచ్‌సీలో గురువారం కొద్దిసేపు విద్యుత్ సౌకర్యం నిలిచిపోవడంతో వార్డుల్లోని రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా బాలింతల వార్డులో లైట్లు వెలగకపోవడం, ఫ్యాన్లు తిరగకపోవడంతో రోగులతోపాటు చిన్నారులు అవస్థలు పడ్డారు. ఆస్పత్రిలో ఇన్వెర్టర్ ఉన్నప్పటికీ సక్రమంగా పనిచేయలేదని సిబ్బంది తెలిపారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చీకటిలో ఇబ్బందులు పడుతున్న రోగులు

కొడవటిపూడిలో లేగదూడల ప్రదర్శన

కోటవురట్ల, ఫిబ్రవరి 8: జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కొడవటిపూడిలో గురువారం ఏర్పాటుచేసిన లేగదూడల ప్రదర్శన పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ డాక్టర్ రామ్మోహన్‌రావు, స్థానిక పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ సింహాద్రప్పడు, సర్పంచ్ కోసూరి అప్పారావు ప్రారంభించారు. వివిధ జాతులకు చెందిన 60 దూడలను ప్రదర్శనకు వచ్చాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి బగుడు రమణ, రెండో బహుమతి కర్రె నూకనాయుడు, మూడో బహుమతి బగుడు నగేష్ దూడలు సాధించాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు బాబూరావు పడాల్, పెట్ల నరేష్ పాల్గొన్నారు.



ప్రదర్శనకు హాజరైన దూడలు

రజతోత్సవాలను విజయవంతం చేయాలి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 8: ఈనెల 10, 11, తేదీల్లో విశాఖ ఏయూ ప్లాటినమ్ జూబ్లీ అతిథి గృహం (సెమినార్ హాల్)లో జరిగే రజతోత్సవాలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ మండల శాఖ కన్వీనర్ దోని నూకరాజు కోరారు. గురువారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ ఉత్సవాల్లో ప్రొఫెసర్ జి. హరగోపాల్, జి.ఉమామహేశ్వరరావు, డి.చంద్రశేఖర్ వక్తలుగా హాజరవుతారన్నారు.

అమాత్యుని ఇష్టారాజ్యం!

... 5వ పేజీ తరువాయి

సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ (ఎంపీపీ) నిధులు రూ.9 లక్షలతోపాటు గ్రామస్థులు రూ.4 లక్షలు చందాలు సేకరించి రెండేళ్ల క్రితం కల్యాణ మండపం భవన నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఈ భవనం పైన రామాలయం నిర్మించాలని స్థానిక వైసీపీ నాయకులు భావించి, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రైవేటు పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల నుంచి విరాళాలుగా సమకూర్చాలని కోరారు. దీంతో సుమారు రూ.20 లక్షల మేర విరాళాలు వచ్చాయి. కింద కల్యాణమండపం, పైన రామాలయానికి కలిపి 'శ్రీ గుడివాడ గురునాథరావు గారి కల్యాణ మండపం' అని పేరు పెట్టారు. ఆలయం పేరు మాత్రం ఎక్కడా కనిపించడంలేదు. అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర అభ్యంతరం చెబుతున్నారు. రామాలయానికి రాజకీయ నేత పేరు పెట్టడం ఏమిటని మండిపడుతున్నారు.



కన్నూరుపాలెంలో గుడివాడ గురునాథరావు పేరుతో ఏర్పాటు చేసిన పార్కు, ఆయన విగ్రహం

ఖాళీ స్థలాల పన్ను మదింపునకు యజమానులు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

అర శాతం పన్ను.. అంటే రూ.7,500 చెల్లించాల్సి ఉంటుంది. ఖాళీ స్థలాలకు కనీసం నాలుగు సంవత్సరాలపాటు పన్ను చెల్లించి వుంటే ఆటువంటి స్థలంలో భవన నిర్మాణం చేపట్టాలనుకున్నా టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు త్వరగా జారీ అవుతాయి. దీంతో ఖాళీ స్థలాలకు రక్షణతోపాటు భవిష్యత్తులో భవన నిర్మాణాలు చేపడితే త్వరగా అనుమతులు వస్తాయన్న ఉద్దేశంతో వీఎల్‌టీ చెల్లించేందుకు పలువురు దరఖాస్తు చేస్తున్నారు.

పేరుకుపోతున్న వీఎల్‌టీ దరఖాస్తులు

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో గత రెండు వారాలుగా వీఎల్‌టీ దరఖాస్తుల పరిశీలన నిలిచిపోయింది. సుమారు 140 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ ఇటీవల సాలూరు మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. వీఎల్‌టీ పన్నులకు సంబంధించిన డిజిటల్ సైన్ కీ లాగ్‌అవుట్ అయ్యారు. ఆయన స్థానంలో అమలాపురం మునిసిపాలిటీ నుంచి అధికారిని నియమించారు. ఇతను విధుల్లో చేరడంలో జాప్యం జరిగింది. అంతేకాక డిజిటల్ కీ లాగిన్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తినట్టు తెలిసింది. ఈ విషయం తెలియక పలువురు దరఖాస్తుదారులు జీవీఎంసీ రెవెన్యూ విభాగానికి వెళ్లి పెండింగ్ దరఖాస్తుల గురించి ప్రశ్నిస్తే.. డిజిటల్ కీ ఇంకా లాగిన్ కాలేదని బదులిస్తున్నారు. దీనిపై కొత్త జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐ.అయ్యప్పనాయుడును వివరణ కోరగా.. డిజిటల్ కీ రెండు, మూడు రోజుల్లో వస్తుందని, లాగిన్ కాగానే వీఎల్‌టీ దరఖాస్తులన్నిటిని క్లియర్ చెస్తామని చెప్పారు.

సీనియర్స్ కమ్ బ్యాక్!

... 5వ పేజీ తరువాయి

వ్యవహరించేందుకు సన్నద్ధమై ఇటీవల జనసేన పార్టీలో చేరారు. జనసేన క్యాడర్‌తో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చలు సాగిస్తున్నారు. కాగా ఇద్దరు నేతలు వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ రానున్న ఎన్నికల్లో ఉమ్మడిగా ఎన్నికల బరిలో నిలువనున్న నేపథ్యంలో వైసీపీని ఓడించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం వివక్షపై సీపీఎం నిరసన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : కేరళ ప్రభుత్వంపై కేంద్రం చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా గురువారం నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కమ్యూనిస్టులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ.. ఆ రాష్ట్రానికి రావాల్సిన పన్నుల్లో వాటాను కుదించివేయడం, జీఎస్టీ పరిహారం నిలిపివేయడం, రెవెన్యూ లోటు భర్తీకి ఇవ్వాల్సిన గ్రాంట్‌లను తొక్కి పెట్టడం సరికాదన్నారు. కేరళ ముఖ్యమంత్రితో సహా ఆ రాష్ట్ర మంత్రులందరూ ఢిల్లీలో చేస్తున్న ధర్నాకు ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కూడా మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పీఎస్ అజయ్‌కుమార్, రాజాన దొరబాబు, ఐఆర్ గంగాధర్, గంటా శ్రీరామ్, అల్లు రాజు, వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ అందుబాటులోకి తేవాలి : రత్నాకర్



గ్రామస్థులతో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

కొత్తూరు, ఫిబ్రవరి 8 : అనకాపల్లి మండలం సుందరయ్యపేట విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తెరిచి గ్రామస్థులకు అందుబాటులోకి తేవాలని టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో ఆయన పర్యటించారు. తాళాలు వేసిన ఉన్న విలేజ్ క్లినిక్‌ను చూసి గ్రామస్థులకు అడగ్గా.. ఇది ఎప్పుడూ మూసి ఉంటుందన్నారు. కనీసం ఇక్కడ వైద్యం అందించకపోవడం అన్యాయమన్నారు. వైద్యాధికారులు తక్షణమే స్పందించి విలేజ్ క్లినిక్‌లో మందులు, వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మొల్లి శ్రీనివాస్, వెంకటేష్, సీహెచ్.నాయుడు, బాదపు అప్పలనాయుడు, ఉరుకుటి రమణమ్మ పాల్గొన్నారు.

అనకాపల్లి నుంచి పోటీకి దరఖాస్తు : గంగాధర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : రానున్న ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తనకు అవకాశమివ్వాలని కాంగ్రెస్ పార్టీ నేత, న్యాయవాది ఐఆర్ గంగాధర్ విజయవాడ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలకు తీసిపోకుండా ప్రచారం నిర్వహించి, ప్రజల వద్దకు కాంగ్రెస్ పార్టీ విధానాలను తీసుకెళ్లామన్నారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, మండల అధ్యక్షుడు కట్టుమూరి నూకఅప్పారావు, కశింకోట అధ్యక్షుడు ఎస్. గజ్జాలు ఉన్నారు.

గ్యాస్ ఏజెన్సీకి పర్మినెంట్ డీలరును నియమించాలి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8: అనకాపల్లిలో ఇండియన్ ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీకి పర్మినెంట్ డీలరును నియమించాలని సీపీఐజోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీకి 2007 నుంచి పర్మినెంట్ డీలరు లేరని, అప్పటి నుంచి ఇన్‌చార్జి డీలర్లకు అప్పగించగా వారు బినామీలతో నడిపించడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.సమావేశంలో సీపీఐ నేతలు తాకాశి వెంకటేశ్వరరావు, కోరిబిల్లి శంకరరావు, శ్రీరామదాసు గోవిందరావు పాల్గొన్నారు.

29లోగా దుకాణాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

▸▸ కార్మిక శాఖ సహాయ కమిషనర్ వసంతరావు

కొత్తూరు, ఫిబ్రవరి 8: ఈనెల 29లోగా జిల్లాలో ఉన్న అన్ని దుకాణాలు, సంస్థల నిర్వాహకులు కార్మిక శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ అధికారి కె.వసంతరావు కోరారు. కార్మిక శాఖ కార్యాలయంలో వర్తక వాణిజ్య యాజమాన్య సంఘాలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్, రెన్యువల్ నిమిత్తం కార్మిక కార్యాలయానికి రాకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లో గాని, మీ-సేవ కేంద్రంలో గాని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. యజమానులందరూ సమావేశంలో అల్లూరి జిల్లా ఇన్‌చార్జి టి.సుజాత, చోడవరం సహాయ కార్మిక శాఖాధికారి పి.సూర్యనారాయణ, అనకాపల్లి కార్మిక శాఖాదికారులు కె.బాలకృష్ణ, కె.నరేంద్ర పాల్గొన్నారు.


సబ్‌జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శేషమ్మ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : స్థానిక సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి ఎంపీ శేషమ్మ గురువారం పరిశీలించారు. జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారికి సంబంధించిన నేర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరం చేస్తే వచ్చే సమస్యలు,చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి, న్యాయవాదులు కె.సాయిరాం, తులసీ, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : రాష్ట్రంలో రైతులకు ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి అప్పలరాజు ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రైతులు పెట్టుబడికి గిట్టుబాటు ధర లేక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. రైతులకు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు సబ్సిడీ మీద ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో వేచలపు కాసుబాబు, అప్పలనాయుడు, గొర్రెల దేముడు, కోరిబిల్లి శంకరరావు పాల్గొన్నారు.

దళితవాడ పంచాయతీ సాధన సభకు ఏర్పాట్లు

పాయకరావుపేట, ఫిబ్రవరి 8 : అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభకు ఏర్పాట్లు చేస్తున్నామని దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్ తెలిపారు. గురువారం ఇక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసం పదేళ్లుగా పోరాటం చేస్తున్న పీవీ.సునీల్‌కుమార్‌కు దళితులంగా మద్దతుగా నిలవాలన్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది హాజరయ్యే అవకాశమున్నందున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నెలపర్తి అర్జున్, పల్లా విలియంకేరి, ఇంజరపు సూరిబాబు, ఐఎన్.మూర్తి, ఎం.నాగరాజు, కసింకోట సత్తిబాబు పాల్గొన్నారు.

'షర్మిల సభలను విజయవంతం చేయాలి'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 : ఈ నెల 10వ తేదీన నర్సీపట్నం, పాడేరుల్లో జరగబోయే పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రచ్చబండ, బహిరంగసభలను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం పట్టణంలో వైఎస్ షర్మిల పర్యటనపై పార్టీ ముఖ్యనేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసభలను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సనపాల అన్నాజీరావు, ఐఆర్ గంగాధర్, దాసరి సంతోష్, వేగి దివాకర్, రాహుల్, నాయకులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

గబ్బాడలో జగనన్న ఇళ్ల కాలనీ
లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

» ఆర్డీవో కార్యాలయంలో గ్రామ నాయకులు ఫిర్యాదు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 8 : మండలంలోని గబ్బాడలో జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అర్హులకు న్యాయం చేయాల్సిందిగా ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ ఈర్లి రాజుబాబుతో పాటు పలువురు ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి ప్రకాశరావుకు ఫిర్యాదు చేశారు. కాలనీకి సంబంధించి ఇళ్ల స్థలాల మంజూరు విషయంలో వివక్షత చూపుతూ అనర్హులకు పట్టాల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై వెంటనే స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాకిరెడ్డి రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కలెక్షన్ సెంటర్'లో ఎం.బుక్ సమస్యపై వినతి

నాతవరం, ఫిబ్రవరి 8 : జిల్లేడిపూడిలో నాతవరం రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కలెక్షన్ సెంటర్ భవనానికి సంబంధించి పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎం.బుక్‌లో నమోదు చేయకపోవడంతో బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఎంపీడీవో జె.రాంబాబుకు సంఘం సీఈవో జగ్గారావు, డైరెక్టర్ లాలం లోవ గురువారం ఫిర్యాదు చేశారు. 25శాతం రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం నిధులు, 75శాతం ప్రభుత్వ నిధులతో దీని నిర్మాణాన్ని చేపట్టినట్టు చెప్పారు. రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు, శుభ్రపర్చుకునేందుకు, ఇతర అవసరాలకు ఉపయోగపడేలా దీనిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మించామన్నారు. దీనిపై వెంటనే స్పందించి మెజర్‌మెంట్ బుక్ పనుల వివరాలు నమోదు చేసేలా చర్యలు చేపట్టాల్సిందిగా వారు కోరారు.


ప్రభుత్వ కార్యాలయాల్లో విధులపై అవగాహన

మాకవరపాలెం, ఫిబ్రవరి 8 : ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను ఇక్కడి మండల పరిషత్ కార్యాలయానికి గురువారం తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మూర్తి మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, వారి విధులు తదితరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు అన్నీ కష్టాలే!

» ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు విన్నవించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధులు » పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా వేడుకోలు

గొలుగొండ, ఫిబ్రవరి 8 : ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న నర్సీపట్నం ప్రాంతంలో గల ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గీతాకృష్ణ, కార్యదర్శి రాము ఆరోపించారు. ఈ మేరకు ఫెడరేషన్ సభ్యులతో కలిసి ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు దృష్టికి సమస్యలను తీసుకు వెళ్లారు. జోగంపేట వసతి గృహంలో విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతిచెందిన నేపథ్యంలో ఆయన ఇక్కడకు విచ్చేసిన సందర్భంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు, పాఠశాలల్లో సరైన వసతులు కరువయ్యాయన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల నడుమ విద్యనభ్యసించాల్సి వస్తోందన్నారు. పలుచోట్ల అద్దె భవనాల్లో వసతి గృహాలు ఉంటుండడం వల్ల చాలీచాలని వసతులతో నెట్టుకొస్తున్నాయన్నారు. వెంటనే ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపట్టాల్సిందిగా వారు కోరారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వసతి గృహాల్లో సమస్యలు వివరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

అక్రమ అరెస్టులపై
ఆశ కార్యకర్తలు ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశ కార్యకర్తల ధర్నా

నర్సీపట్నం, ఫిబ్రవరి 8 : చలో విజయవాడ నిరసన కార్యక్రమానికి వెళుతున్న ఆశ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం మండలాల నుంచి విజయవాడలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అక్రమ అరెస్టులతో అడ్డుకోవడం సరికాదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు టి.ఈశ్వరరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రునికి విశేష పూజలు

మాకవరపాలెం, ఫిబ్రవరి 8 : ఇక్కడి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరబ్రహ్మంగారి మఠపీఠాధిపతులైన వీరశివకుమార్‌స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టారు. సంఘం అధ్యక్షులు ఆదినారాయణ, నారాయణరావు, శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామివారి ఆలయంలో అర్చకుల పూజలు

'నిర్భయంగా ఓటు వేయండి'



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

నాతవరం, ఫిబ్రవరి 8 : రానున్న ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు వేసి, మంచి నాయకులను ఎన్నుకోవాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ సూచించారు. ఎంపీడీవో జె.రాంబాబుతో కలిసి నాతవరంలో గురువారం ఓటర్లతో ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం : ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మురళీమోహన్‌రావు సూచించారు. ఇక్కడి వెలుగు కార్యాలయంలో గురువారం డ్వాక్రా మహిళలకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు ఎంతో విలువైనదని, ఎవరి ప్రలోభాలకు తల్గొకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటీ శంకరరావు, వెలుగు ఏపీఎం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

అమాత్యుని ఇష్టారాజ్యం!

... 5వ పేజీ తరువాయి

సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ (ఎంపీపీ) నిధులు రూ.9 లక్షలతోపాటు గ్రామస్థులు రూ.4 లక్షలు చందాలు సేకరించి రెండేళ్ల క్రితం కల్యాణ మండపం భవన నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఈ భవనం పైన రామాలయం నిర్మించాలని స్థానిక వైసీపీ నాయకులు భావించి, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రైవేటు పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల నుంచి విరాళాలుగా సమకూర్చాలని కోరారు. దీంతో సుమారు రూ.20 లక్షల మేర విరాళాలు వచ్చాయి. కింద కల్యాణమండపం, పైన రామాలయానికి కలిపి 'శ్రీ గుడివాడ గురునాథరావు గారి కల్యాణ మండపం' అని పేరు పెట్టారు. ఆలయం పేరు మాత్రం ఎక్కడా కనిపించడంలేదు. అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర అభ్యంతరం చెబుతున్నారు. రామాలయానికి రాజకీయ నేత పేరు పెట్టడం ఏమిటని మండిపడుతున్నారు.

ఖాళీ స్థలాల పన్ను మదింపునకు యజమానులు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

అర శాతం పన్ను.. అంటే రూ.7,500 చెల్లించాల్సి ఉంటుంది. ఖాళీ స్థలాలకు కనీసం నాలుగు సంవత్సరాలపాటు పన్ను చెల్లించి వుంటే అటువంటి స్థలంలో భవన నిర్మాణం చేపట్టాలనుకున్నా టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు త్వరగా జారీ అవుతాయి. దీంతో ఖాళీ స్థలాలకు రక్షణతోపాటు భవిష్యత్తులో భవన నిర్మాణాలు చేపడితే త్వరగా అనుమతులు వస్తాయన్న ఉద్దేశంతో వీఎల్‌టీ చెల్లించేందుకు పలువురు దరఖాస్తు చేస్తున్నారు.

పేరుకుపోతున్న వీఎల్‌టీ దరఖాస్తులు

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో గత రెండు వారాలుగా వీఎల్‌టీ దరఖాస్తుల పరిశీలన నిలిచిపోయింది. సుమారు 140 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ ఇటీవల సాలూరు మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. వీఎల్‌టీ పన్నులకు సంబంధించిన డిజిటల్ సైన్ కీ లాగ్‌అవుట్ అయ్యారు. ఆయన స్థానంలో అమలాపురం మునిసిపాలిటీ నుంచి అధికారిని నియమించారు. ఇతను విధుల్లో చేరడంలో జాప్యం జరిగింది. అంతేకాక డిజిటల్ కీ లాగిన్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తినట్టు తెలిసింది. ఈ విషయం తెలియక పలువురు దరఖాస్తుదారులు జీవీఎంసీ రెవెన్యూ విభాగానికి వెళ్లి పెండింగ్ దరఖాస్తుల గురించి ప్రశ్నిస్తే.. డిజిటల్ కీ ఇంకా లాగిన్ కాలేదని బదులిస్తున్నారు. దీనిపై కొత్త జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐ.అయ్యప్పనాయుడును వివరణ కోరగా.. డిజిటల్ కీ రెండు, మూడు రోజుల్లో వస్తుందని, లాగిన్ కాగానే వీఎల్‌టీ దరఖాస్తులన్నిటిని క్లియర్ చెస్తామని చెప్పారు.

చోడవరం
నియోజకవర్గం

నర్సీపట్నంలో షర్మిల సభ విజయవంతం చేయాలి

» కాంగ్రెస్ అధికార ప్రతినిధి వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న గూనూరు వెంకటరావు

చోడవరం, ఫిబ్రవరి 8: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 10న నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గూనూరు వెంకటరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సభలో చెరకు రైతుల కష్టాలు, షుగర్ ఫ్యాక్టరీల స్థితిగతులు, రహదారుల దుస్థితిని షర్మిల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు తెలిపారు. చోడవరంలో రహదారుల సమస్యల వల్ల అనేకమంది అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చోడవరం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగుతానని వెంకటరావు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రావికమతం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జంపా నాగేశ్వరరావు, మైనారిటీ సెల్ నాయకులు షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

14న శ్రీవిజ్ఞాన స్కూల్‌లో ఉచిత సామూహిక అక్షరాభ్యాసాలు

చోడవరం, ఫిబ్రవరి 8: ఈనెల 14 వసంత పంచమి సందర్భంగా స్థానిక శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్కూల్ డైరెక్టర్ ఎంఎంకే.రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అవసరమైన పూజాసామగ్రి ఉచితంగా అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పేర్ల వివరాలు, గోత్రనామాలను ఈనెల 13లోగా 8500872211, 9966613368, 8185855174 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేయించుకోవాలని సూచించారు.

మైదానంపై మంచు దుప్పటి

» ఉదయం 11 గంటలకూ వీడని మంచు

చోడవరం, ఫిబ్రవరి 8: చలికాలం ముగింపు దశ వచ్చేసరికి మైదానాన్ని మంచు దుప్పటి కప్పేస్తున్నది. గడచిన వారం రోజులుగా మైదానంలో మంచు దట్టంగా కురుస్తున్నది. ఉదయం 9 గంటల వరకూ మంచు మేఘాలు ఉంటున్నాయి. మంచు తెరల వల్ల వాహనదారులు సైతం లైట్లు వేసుకుని తిరుగుతున్నారు. ఏజెన్సీ ప్రాంతానికే పరిమితమైన మంచు వాతావరణం మైదాన ప్రాంతంలో కనిపిస్తుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. గురువారం నాడు పట్టణంలో ఉదయం 11 గంటలకు సైతం మంచు వీడకపోవడం విశేషం. మొత్తం మీద చలికాలం సీజన్ ముగిసే సమయంలో నెలకొన్న మంచు వాతావరణం స్థానికులను ఆనందానికి గురిచేస్తున్నది.



మంచు కారణంగా పట్టణంలో నెలకొన్న వాతావరణం

బడ్జెట్‌లో రైతులకు కొరవడిన భరోసా

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 8: రాష్ట్ర బడ్జెట్‌లో రైతుకు భరోసా కరువైందని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ధ్వజమెత్తారు. గురువారం వడ్డాదిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమమంటూ గొప్పలు చెప్పే వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా ఖర్చు పెట్టలేకపోయిందని విమర్శించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రెండేళ్లుగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో పనుల్లో పురోగతి లేదన్నారు. ఇన్వెస్టిగేషన్, ఇతర ఖర్చుల కోసం పైసా విదల్చకపోవడం భూసేకరణ పనులు నిలిచిపోయయన్నారు. పెద్దేరు రిజర్వాయర్ అభివృద్ధి ఊసే లేకుండా పోయిందన్నారు. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రతీ స్కీము ఓ స్కామ్‌గా మారిందని ఆరోపించారు. సీఎం జగన్ ప్రజలు మోయలేనంతగా ధరల పెంపు, పన్నుల భారం మోపారన్నారు. నాడు-నేడు పథకంలో రూ.3వేల కోట్ల అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. ఐదేళ్లుగా అప్పులే అలంబనగా జగన్ సర్కార్ చేస్తున్న పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని తాతయ్యబాబు అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు జి.కోటేశ్వరరావు, డి.అప్పలనాయుడు, ఎంవీవీ.సత్యనారాయణ, ఎస్.శ్రీరామూర్తి, వి.అప్పారావు, ఎం.తాతయ్యబాబు, డి.అప్పారావు పాల్గొన్నారు.

బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమి లేదు

చీడికాడ, ఫిబ్రవరి 8: బడ్జెట్ వలన రాష్ట్రానికి ఒరిగిందేమి లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు విమర్శించారు. మండలంలోని దిబ్బపాలెంలో ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు స్వగృహం వద్ద గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర బడ్జెట్‌లో మాడుగుల నియోజకవర్గంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు ఎటువంటి నిధులు కేటాయించలేదన్నారు. టీడీపీ హయాంలో నిధులు కేటాయించారే తప్ప వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. రైతులు పండించిన పంటలకు సైతం గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. రైతులకు పంటల బీమా కూడా ఇవ్వలేదన్నారు. మిచ్చాంగ్ తుఫాన్‌కు జరిగిన పంట నష్ట పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. నియోజకవర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఉన్నా నియోజకవర్గానికి బడ్జెట్‌లో మొండిచేయి చూపితే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మరో రెండు నెలల్లో జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు పోతల చిన్నంనాయుడు, బొబ్బాది తాతారావు, కసిరెడ్డి అప్పలనాయుడు, జూరెడ్డి రాము, పైల ముత్యాలనాయుడు, శరగడం శివ, మొల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



చీడికాడ: విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు పీవీజీ.కుమార్, రామానాయుడు

చలో పాయకరావుపేటను జయప్రదం చేయండి

దేవరాపల్లి, ఫిబ్రవరి 8: ఈనెల పదిన చలో పాయకరావుపేట దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభను జయప్రదం చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ మండల కమిటీ సభ్యులు కోరారు. దేవరాపల్లి, వెంకటరాజపురం, తెనుగుపూడి, గర్శింగి, తదితర గ్రామాల్లో గురువారం విస్తృత ప్రచారం చేశారు. మండల ఎయిమ్ అధ్యక్షుడు దువ్వాడ రమేశ్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయం ఎయిమ్‌తోనే సాధ్యమన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం

» జనసేన, టీడీపీ నేతలు పీవీఎస్ఎన్ రాజు, తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 8: అవినీతి, అసమర్థ పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే జనసేన, టీడీపీ లక్ష్యమని టీడీపీ, జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జులు బత్తుల తాతయ్యబాబు, పీవీఎస్ఎన్.రాజు పేర్కొన్నారు. జనసేన పార్టీ చేపట్టిన లక్ష్యం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాదయాత్రకు టీడీపీ నాయకులు సంఘీభావం ప్రకటించి, పాదయాత్రలో పాల్గొన్నారు. బంగారుమెట్ట కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి రాజు, తాతయ్యబాబు పూలమాలలు వేశారు. అనంతరం బంగారుమెట్ట నుంచి వడ్డాది వరకు పాదయాత్ర నిర్వహించారు. వడ్డాది కూడలిలో వారు మాట్లాడుతూ, పెద్దేరు రిజర్వాయర్ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తప్పుడు ప్రకటనలు చేసి రైతులను మోసం చేశారని ఆరోపించారు. వడ్డాది కస్బా, మంగళాపురం, గౌరీపట్నం గ్రోయిన్‌లు దెబ్బతిని నాలుగేళ్లు అవుతున్నా ప్రభుత్వం చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వైసీపీ పాలనలో పతనం అంచనకు చేరుకోవడంతో 23వేల కుంటుంబాలు పరిస్థితి తారుమారైందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చరమ గీతం పాడి, టీడీపీ, జనసేన సంయుక్త కూటమికి విజయం చేకూర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, మాజీ ఎంపీపీ ఎంవీవీ. సత్యనారాయణ, పార్టీ నాయకులు డొంకిన అప్పలనాయుడు, వెలంకాయల అప్పలనాయుడు, దొండా గిరిబాబు, జనసేన పార్టీ నాయకులు డీఎస్.నాయుడు, దొండా సాయి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



బీఎన్ రోడ్డులో పాదయాత్ర చేస్తున్న పీవీఎస్ఎన్.రాజు, తాతయ్యబాబు తదితరులు

మాడుగుల
నియోజకవర్గం

హోరాహోరీగా ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ, ఫిబ్రవరి 8: మండలంలోని దిబ్బపాలెంలో మరిడిమాంబ తీర్థం పురస్కరించుకొని గురువారం సాయంత్రం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో 15జతల ఎడ్లు పాల్గొనగా విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు బహుమతులను ఎంపీటీసీసభ్యుడు దారపు పెద్దినాయుడు, సర్పంచ్ తుంపాల నిరంజని, గ్రామపెద్దలు అందించారు.సాయంత్రం కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 8: మండలంలో పినకోట పీహెచ్‌సీ పరిధిలో 35 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి జి.వెంకటేష్ గురువారం తెలిపారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. అలాగే జాతీయ నులుపురుగుల నివారణా దినోత్సవం శుక్రవారం ప్రతి పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండోజోల్ మాత్రలు వేయనున్నట్టు తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ రవి, ఆప్తాలమిక్ అధికారి రమణబాబు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవీ, ఫార్మసిస్ట్ అశ్విని, తులసి, జయ, పుష్ప, కె.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాములవారి తీర్థం

మాడుగుల, ఫిబ్రవరి 8: మండలంలో ద్వారకానగర్ గ్రామంలో శ్రీరాముల తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలతోపాటు ఎడ్ల, గుర్రపు పందాలు నిర్వహించి బహుమతులు అందించారు. అదేవిధంగా దొరసురవరంలో కూడా పసరమోద తీర్థం నిర్వహించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్యాన్స్ బేబి డ్యాన్స్‌ని నిర్వహించారు.

నేడు జనసేన ఆత్మీయ సమావేశం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి డి.సురవరం వెళ్లే మార్గంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ తెలిపారు. ఈ సమావేశానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్, ఉత్తరాంధ్ర వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీనియర్స్ కమ్ బ్యాక్!

... 5వ పేజీ తరువాయి

వ్యవహరించేందుకు సన్నద్ధమై ఇటీవల జనసేన పార్టీలో చేరారు. జనసేన క్యాడర్‌తో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చలు సాగిస్తున్నారు. కాగా ఇద్దరు నేతలు వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ రానున్న ఎన్నికల్లో ఉమ్మడిగా ఎన్నికల బరిలో నిలువనున్న నేపథ్యంలో వైసీపీని ఓడించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.

ఘనంగా బీబీపట్నం హైస్కూల్ వార్షికోత్సవం

రోలుగుంట, ఫిబ్రవరి 8 : మండలంలోని బీబీపట్నం హైస్కూల్ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వివిధ సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అప్పారావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత చదువులను చదవడానికి పదో తరగతే కీలమన్నారు. అనంతరం పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకుల కిశోర్‌గుప్తా ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గరగా విశ్వేశరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బీబీపట్నం జడ్పీ పాఠశాలలో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని ఆందోళన

దేవరాపల్లి, ఫిబ్రవరి 8: గిరిజనుల జీవనాధారమైన జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు ఆందోళన చేశారు. గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు బీటీ.దొర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ, జీడి పిక్కలకు గిట్టుబాటు ధర లేక దళారులు చేతిలో మోస పోతున్నారన్నారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో జీడిమామిడి పంట సాగవుతుందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు, వ్యవసాయాధికారికి వినతిపత్రం ఇచ్చారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జీడిరైతులు